క్లుప్తంగా

నేడు స్పాట్ అడ్మిషన్లు

చిట్యాల: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో నేడు(బుధవారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో 10 సీట్లు, ఇంటర్‌లో మొదటి సంవత్సరం సీఈసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94411 36322 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్ కుమారుడు కిరణ్ గౌడ్ హైదరాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్ రావు ఉన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు ఇంకెప్పుడు ఇస్తారు?'

కాటారం: మహాముత్తారం మండలంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇంకెప్పుడు ఇస్తారని, మంత్రి శ్రీధర్‌బాబుకు పేదోడి సొంతింటి కల నెరవేర్చే ఉద్దేశం ఉందా లేదా అని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధంగా ఉందని వారం రోజుల్లో మంజూరు చేస్తామని మంత్రి స్వయంగా మహదేవపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో చెప్పారన్నారు. రోజులు గడుస్తున్న ఇప్పటికీ జాబితా విడుదల చేయలేదని అన్నారు. స్థానికల ఎన్నికల కోసమే ఇళ్లు ఇప్పుడు ఇస్తాం, అప్పుడు ఇస్తాం అని చెప్పుకొస్తున్నారని ఆరోపించారు.

'చర్య తీసుకోవాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రావడం లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి మాట్లాడారు. ఇంగ్లిష్ టీచర్ నెల రోజులుగా ఎలాంటి సెలవు లేకుండా పాఠశాలకు రావడం లేదని, సంబంధిత అధికారులు ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలన్నారు. ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కనకం తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ పరామర్శించారు. అనంతరం రూ.26 వేలతో పాటు యాభై కిలోల బియ్యాన్ని అందజేశారు. వారి వెంట నాయకులు బైరం భద్రయ్య, తొటం నవీన్, బుర్ర శ్రీధర్, పాండ్రాల స్వామి ఉన్నారు.

బియ్యం అందజేత



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మానసపల్లికి చెందిన నెగరకంటి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ నర్సింహారావు, ఎల్లయ్య పాల్గొన్నారు.

పోస్టుమార్టం

గణపురం: మండలకేంద్రంలోని గణపసముద్రం చెరువు వద్ద సోమవారం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై రేఖ అశోక్ మంగళవారం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే విధంగా లేక కుళ్లి పోవడంతో వైద్య సిబ్బందిని ఇక్కడికే తీసుకువచ్చి పోస్టుమార్టం నిర్వహించి నట్లు పేర్కొన్నారు. అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిర్మాణాలపై నిర్లక్ష్యం!



అద్దె భవనంలో ఏలేటిరామయ్యపల్లి జీపీ కార్యాలయం



శిథిలావస్థలో ఉన్న నైన్‌పాక జీపీ భవనం

- నేటికీ పూర్తికాని జీపీ భవనాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

చిట్యాల: మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో 14 పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేశారు. అందులో పది జీపీల భవనాలు పూర్తి కాగా మిగతా నాలుగు పూర్తి కాలేదు. నైన్‌పాక, దూత్‌పల్లిలో పనులు ప్రారంభించిన నేటికి అసంపూర్తిగానే నిలిచి పోయాయి. ఏలేటిరామయ్యపల్లిలో స్థలం విషయంలో గొడవతో పనులు ప్రారంభించలేదు. దీంతో అద్దె భవనంలోనే సిబ్బంది విధులను కొనసాగిస్తున్నారు. చల్లగరిగలో జీపీ భవనం మంజూరైన ఇంత వరకు పనులను ప్రారంభించలేదు. గ్రామస్తులు, సంబంధిత అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గోపాలపూర్, సీఆర్‌పల్లి గ్రామాల్లో నూతన భవనాలకు శంకుస్థాపన చేసిన గోపాలపూర్‌లో స్థలం లేకపోవడంతో పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే సీఆర్‌పల్లిలో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.



దూత్‌పల్లిలో అసంపూర్తిగా ఉన్న జీపీ భవన నిర్మాణం

శిథిలావస్థలో భవనాలు..

మండలంలోని నైన్‌పాక, గోపాలపూర్, చల్లగరిగ, చిట్యాల, గిద్దెముత్తారం, ముచినిపర్తి గ్రామాలలోని జీపీ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షాకాలంలో చాలా ఇబ్బందికరంగా మారుతోంది. కనీసం సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీపీ భవనాలు సరిగా లేక పోవడంతో పలు గ్రామాల్లో సభలు సమావేశాలు నిర్మించాలంటే గ్రామస్తులతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మంజూరైనా భవనాలను త్వరితగతిన పనులు చేపట్టాలని తెలుపుతున్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పలు భవనాలకు నిధులు మంజూరు చేసి నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

మానేరులో మట్టి రోడ్డు పునరుద్ధరణ



మరమ్మతులు చేయిస్తున్న కాంట్రాక్టర్

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు మానేరులో ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు సోమవారం రాత్రి వరదకు కోతకు గురై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నిత్యం రవాణా కొనసాగే తాత్కాలిక రోడ్డు కోతకు గురి కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా మానేరులో అంతర్‌జిల్లా వంతెన పనులు చేస్తున్న కాంట్రాక్టర్ తాత్కాలిక మట్టి రోడ్డును పునరుద్ధరించారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే మానేరులో వంతెన నిర్మాణం పూర్తి కావడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకుని వంతెన నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.

సీఐగా రమేశ్



వెంకటాపురం(కె): వెంకటాపురం(కె) సీఐగా ముత్యం రమేశ్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలుబడ్డాయి. ఇక్కడ పని చేస్తున్న బండారి కుమార్ హైదరాబాద్ ఏడీజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ప్రస్తుత సీఐ రమేశ్ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల నుంచి బదిలీపై రానున్నారు.

పస్రా సీఐగా దయాకర్



గోవిందరావుపేట: పస్రా సీఐగా దయాకర్ బదిలీపై వచ్చారు. కాగా, ఇక్కడ సీఐగా పని చేసిన రవీందర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. రవీందర్ పస్రాలో 13 నెలల పాటు పని చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రి సీతక్క సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్క సమక్షంలో మేడారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గండి కోట నారాయణ, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గండి కోట కృష్ణ, నాయకులు జంగా వెంకటేశ్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి, వినోద, రమేశ్ వీరచారి పార్టీలో చేరగా మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

వాజేడు: మండల పరిధిలోని నాగారం పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఓఎఫ్‌ఓలం ఫుడ్ ఇంగ్రీడియన్స్, చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, డ్రాయింగ్ బుక్స్, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు ప్రశాంతి, సంధ్య, పవన్, గణేష్, మణిగోపాల్, బుచ్చి బాబు, బషీర్, సాయి కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.



పంపిణీ చేసిన బ్యాగులతో విద్యార్థులు

టై, బెల్టుల పంపిణీ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని నార్త్ ప్రభుత్వ పాఠశాలలోని 110 మంది విద్యార్థులకు గండెపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టై, బెల్టులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ మల్లయ్య హాజరై పంపిణీ చేశారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాంబశివరావు, హెడ్మాస్టర్ రాజశేఖర్, లొటపెటల రాజేష్, రాధిక, వెంకటయ్య, గండెపల్లి నర్సయ్య, కిరణ్, సాగర్, నవీన చుక్కారావు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డు రద్దు చేయాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

భూపాలపల్లి అర్బన్: అక్రమాలకు పాల్పడుతూ జర్నలిస్టు వృత్తికే కలంకం తెస్తున్న పరకాల సమ్మయ్య అక్రిడిటేషన్ కార్డు రద్దు చేయాలని కాకతీయ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. యూట్యూబ్ చానల్ పేరుతో ప్రజలను, అధికారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతూ జర్నలిజం వృత్తికే విలువ లేకుండా చేస్తున్న సమ్మయ్యగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీఆర్ నగర్‌లో నివాసం ఉంటూ ఓ యూట్యూబ్ చానల్ పేరుతో ఇష్టారాజ్యంగా చలామణి అవుతున్నట్లు తెలిపారు. యూట్యూబ్ చానల్‌కు అనుమతులు, హక్కులు లేవని ఫిర్యాదులో తెలిపారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాకేశ్

ములుగు రూరల్: విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రాకేశ్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అందించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం నేడు (బుధవారం) విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. నాయకులు అరుణ్‌కుమార్, లక్ష్మణ్, ముస్రాప్, భరత్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



కాటారం: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాటారం: మండలంలోని మేడిపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆర్బీఎస్కే మహదేవపూర్ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 80 మంది విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని భోజనం చేసే ముందు చేసిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ సుజాత, ఏఎన్ఎం జమున, లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మండల వైద్యాధికారి భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీనగరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. గ్రామస్తులకు, విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వాజేడు: మండల పరిధిలోని పెద్దగొళ్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం మాతాశిశు సంరక్షణ వైద్యాధికారిణి యోషిత, ఆర్బీఎస్కే వైద్యాధికారి నవీన్ వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాజేడు: కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

సాక్షి నెట్‌వర్క్: మావోయిస్టుల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మండలాల్లోని రహదారులపై పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీని ముమ్మరంగా నిర్వహించారు. ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై సాకపురం దివ్య



మాట్లాడుతున్న ఎస్సై సాకపురం దివ్య

రేగొండ: యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొత్తపల్లిగోరి ఎస్సై సాకపురం దివ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొనరావుపేట గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. తాత్కాలిక ఆనందం కోసం కుటుంబాలను దూరం చేసుకోవద్దన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలన్నారు.

దివ్యాంగులు తరలిరావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాళేశ్వరం: జిల్లా కేంద్రానికి ఈనెల 25న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ రానున్న నేపథ్యంలో దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్, జిల్లా ఇన్‌చార్జ్ దమ్ము వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మహదేవపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేలు పెన్షన్ పెంచి ఇవ్వాలని మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటానికి అత్యధిక సంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రం, అంబాల చంద్రమౌళి, వీరగంటి సమ్మయ్య, కన్నెబోయిన కొమరమ్మ, మీర్జా ముస్తాక్ బేగ్, కలికోట మహేష్, చింతకుంట సదానందం, తూటిచెర్ల దుర్గయ్య, పత్తి మల్లేష్, ఆయిళ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- హెచ్ఎం సోమారెడ్డి



దుస్తులు పంపిణీ చేస్తున్న హెచ్ఎం సోమారెడ్డి

గోవిందరావుపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్ఎం కుందూరు సోమారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మంగళవారం హెచ్ఎం సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వం తీసుకుంటున్న వెంకటేశ్వర్లు

మల్హర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పెద్దతూండ్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం పీఆర్టీయూ సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పాకాల తిరుపతిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోగుల తిరుపతి రెడ్డి, జిల్లా బాధ్యులు ఐత మహేందర్, బొల్లరపు సాంబయ్య, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయులు మానస, యాకుబ్ పాషా, శ్రీనివాస్, రమేష్, రవీందర్, ఎస్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

నాటు వేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఏఓ పూర్ణిమ



రైతులకు వరి నాటులో జాగ్రత్తలను వివరిస్తున్న ఏఓ, ఏఈఓ

కాటారం: రైతులు పొలాల్లో వరి నాట్లు వేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పూర్ణిమ సూచించారు. మండలంలోని రేగులగూడెం క్లస్టర్ పరిధిలోని దేవరాంపల్లి గ్రామ శివారులో వేస్తున్న వరి నాట్లను ఆమె పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. నాటుకు ముందు వరి నారు కొనలను కొంత మేర తుంచి వేయాలన్నారు. దీంతో నారు ముదిరిన, గతంలో సాగు చేసిన పంటలకు సంబంధించిన కాండం తొలుచుపురుగు, లార్వా అవశేషాలు ఉన్న ఈ పంట కాలంలో పంటను ఆశించకుండా కాపాడుకోవచ్చని వివరించారు. రైతులు పంట సాగులో వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఏఓ వెంట ఏఈఓ అస్మా ఉన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న తిరుపతి

రేగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని కొత్తపల్లిగోరి కాంగ్రెస్ పార్టీ టౌన్ యూత్ అధ్యక్షుడు పల్లెబోయిన తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పంపిణీ చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నూతన మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల నిర్మాణం చేపట్టడంతో పాటు తాత్కాలిక భవనంలో పోలీస్ స్టేషన్ ప్రారంభించిందన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మంత్రుల సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఉపాధ్యక్షుడు పసుల రాకేశ్, నాయకులు నరేష్, చందు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ములుగు రూరల్: ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం అప్పయ్యపల్లికి చెందిన ట్రాక్టర్‌లో మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి కంకర తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ట్రాలీకి మధ్యలో రాడ్ విరిగిపోయి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో ట్రాక్టర్ తొలగించారు.